సాక్షి
రంగారెడ్డి
బుధవారం ׀ 8 ׀ నవంబర్ ׀ 2023



ప్రస్థానం అక్కడి నుంచే..

ఇంద్రారెడ్డి, కేఎస్ రత్నం, కాలె యాదయ్య స్థానిక సంస్థల నుంచి ప్రజాప్రతినిధులుగా తమ ప్రస్థానం ప్రారంభించారు. 10లో▸



ఎన్నికల నేరానికి శిక్ష..!

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పిస్తోంది. 10లో▸



సభ్యత్వానికి తహతహ !

ప్రధాన పార్టీల అభ్యర్థులు బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాల వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం కోసం పోటీ పడుతున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

నామినేషన్ కేంద్రం పరిశీలన



నామినేషన్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ దాఖలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరం 144 సెక్షన్ విధించడం జరిగిందని అన్నారు. వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే కేంద్రం లోపలికి అనుమతివ్వడం జరుగుతుందన్నారు. నామినేషన్ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంవద్ద పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన వారిలో రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, డీఐ రాంరెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వీడిన ఉత్కంఠ

చేవెళ్ల కాంగ్రెస్ బీఫాం భీంభరత్‌కే



భీంభరత్‌కు బీఫామ్ అందిస్తున్న ఏఐసీసీ నాయకుడు, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు

చేవెళ్ల: ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్‌కే పార్టీ బీఫాం దక్కింది. రెండు రోజులుగా అభ్యర్థిని మారుస్తారని జోరుగా ప్రచారం సాగింది. ఈ క్రమంలో మంగళవారం ఏఐసీసీ నాయకుడు మాణిక్‌రావు, ఠాక్రే చేతుల మీదుగా భీంభరత్ బీఫాం అందుకున్నారు. భీంభరత్‌కు బీఫాం రాకపోతే తమకే టికెట్ వస్తుందని ఆశించిన ఆశావహులు దీంతో ఉసూరుమన్నారు. మరోవైపు భీంభరత్ మద్దతుదారులు అన్ని మండల కేంద్రాల్లో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఇక కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు.

రూ.4.50 లక్షలు పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్ : ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న పలువురు వ్యక్తుల నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మంగళవారం రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పెద్దఅంబర్‌పేట ఔటర్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో ఈ నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ మన్మోహన్ తెలిపారు.

ఎన్నికల పండుగ.. ఉపాధి మెండుగా

ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడని అభ్యర్థులు

- ఆయా రంగాలకు చేతినిండా పని
- అడ్డా కూలీలకు ఫుల్ గిరాకీ
- పలువురికి ఆదాయ మార్గం



షాద్‌నగర్: అన్ని పార్టీల నుంచి అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. ప్రచారపర్వం ఊపందుకుంది. గెలుపే లక్ష్యంగా ఖర్చుకు వెనుకాడడం లేదు. మరోవైపు ఎన్నికలను పలువురు ఉపాధి మార్గంగా మలుచుకున్నారు. పొట్టకూటి కోసం రోజు పని చేసుకునే వారికి ఎన్నికలు కలిసొచ్చాయి. పలు రంగాల్లో పని చేస్తున్న వారికి చేతినిండా పని దొరుకుతోంది.

ప్రచార రథం.. రాబడి మార్గం

పోటీ చేసే అభ్యర్థుల పేర్లు, పార్టీ గుర్తు ప్రజలకు తెలియాలంటే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారాలు చేయాల్సిందే. గల్లీగల్లీలో ప్రచారాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఎన్నికల ప్రచార రథాలను వేల రూపాయలు ఖర్చు చేసి తయారు చేయించారు. దీంతో వెల్డింగ్ పనులు చేసే వారికి డిమాండ్ బాగుంది. సభలు, సమావేశాలకు జనాన్ని తరలించాలంటే వాహనాలు తప్పనిసరి. వాహనదారులు రోజుకు రూ.1,500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు. మరోవైపు ద్విచక్రవాహనాలు, కార్లకు నేతలు పెట్రోల్, డీజిల్ పోయిస్తున్నారు. దీంతో పెట్రోల్ బంకుల్లో అమ్మకాలు పెరిగాయి.

కరపత్రాలు.. ఫ్లెక్సీలకు డిమాండ్

కరపత్రాలు, ఫ్లెక్సీలతో అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టో, హామీలు, చేసిన, చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిసేలా అన్ని పార్టీల నేతలు కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. సమావేశాలకు, ప్రచారాలు ముఖ్యనేతలు వస్తే భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం అభ్యర్థులు లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఉపాధి దొరుకుతోంది.

ఆట.. పాట.. ఉపాధి వేట

ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు కళాకారులను రప్పిస్తున్నారు. జానపద, డప్పు కళాకారుల బృందాలు ఊరూరా తిరుగుతూ పాటలు, ఆటలు, మాటలతో సందడిగా ప్రచారం సాగిస్తున్నారు. గాయకులతో ప్రత్యేకంగా పాటలు పాడించి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కళాకారుల బృందం సభ్యులు రోజుకు ఒక్కొక్కరు రూ.1000కి పైనే తీసుకుంటున్నారు.

ఆహారం.. ఆదాయం

ప్రచారానికి వచ్చే వారికి ఉదయం ఉపాహారం. మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి కల్పిస్తున్నారు. ఇందు కోసం అభ్యర్థులు ఎన్నికలు ముగిసే వరకు వంటలు తయారు చేసే నలభీములను ముందుగానే బుక్ చేసుకున్నారు. కొందరైతే పూటకు వందల సంఖ్యలో భోజనాలు పెడుతున్నారు. దీంతో వంటచేసే వారితో పాటు కూలీలు, క్యాటరింగ్, హోటళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. వీటిలో వినియోగించే పేపర్ ప్లేట్ల తయారీదారులకు సైతం ఉపాధి లభిస్తోంది.

ఫొటోలు.. వీడియోలు.. డబ్బులు

ప్రచారాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఫొటో, వీడియోగ్రాఫర్లకు మంచి డిమాండ్ ఉంది. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు అభ్యర్థుల వెంట ఉండి ఊరూరా చేసే ప్రచారాలను వీడియోలు, ఫొటోలు తీస్తూ ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇందుకు గాను భారీగానే చార్జ్ చేస్తున్నారు.

టెంటు.. పేమెంటు

గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలంటే విధిగా టెంట్లు, కుర్చీలు, టేబుళ్లు, వంట సామగ్రి కావాల్సి ఉంటుంది. కుర్చీలకు రూ.5 నుంచి రూ.8, టెంటుకు సైజును బట్టి రూ.1000 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. స్టేజీ ఏర్పాటు, గ్రీన్ మ్యాట్, సైడ్ వాల్స్ కోసం మరో రూ.రూ.3వేల వరకు తీసుకుంటున్నారు.

ఉపాధే ఎ'జెండా'

అభ్యర్థులు ఏ గ్రామానికి ప్రచారానికి వెళ్లినా అక్కడ జనంతో తమ బలాన్ని నిరూపించుకుంటున్నారు. ఇందుకు గాను కూలీలతో ప్రచారాన్ని చేపడుతున్నారు. పట్టణాల్లో అయితే రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లిస్తుండగా పల్లెల్లో రూ.200 నుంచి రూ.400 ముట్టజెబుతున్నారు. ప్రచారాలకు వచ్చే మహిళా కూలీలు ఆట పాటలతో అందరినీ అలరిస్తున్నారు. ఏ పార్టీ అభ్యర్థి పిలిచినా ఆ పార్టీ జెండాలు చేతపట్టుకుని అడుగులు వేస్తున్నారు. బతుకమ్మలు, బోనాలతో ప్రచారం చేస్తున్నారు.గ్రామాలకు వచ్చే అభ్యర్థులకు మహిళా కూలీలతో మంగళహారతులు పట్టిస్తున్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాలి

- రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు కూడలిలో విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను మంగళవారం సాయంత్రం రాచకొండ సీపీ చౌహాన్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి సందర్శించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ గురించి సీఐ మన్మోహన్‌తో పాటు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల తనిఖీని క్షుణ్ణంగా చేపట్టాలని ఆదేశించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు బుధవారం సాయంత్రం 5గంటల లోపు ఫామ్-12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితాలో ఉన్న పూర్తి వివరాలను ఫామ్-12డీలో పొందుపరుస్తూ బుధవారం సాయంత్రం 5గంటలలోపు సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు.



అభిమానులకు ప్రధాని మోదీ అభివాదం

నమో బీసీ మంత్రం

బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతం

- ఓపెన్ టాప్ జీపులో జనం మధ్యకు ప్రధాని
- పూల వర్షం కురిపించిన అభిమానులు
- మోదీ నామస్మరణతో మార్మోగిన ఎల్బీస్టేడియం
- కమలం పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ తలపెట్టిన బీసీ ఆత్మగౌరవ సభ విజయవంతమైంది. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై బీసీల ఐక్యతను చాటి చెప్పారు. 'జై శ్రీరాం .. జయహో.. వందే మాతరం' నినాదంతో సభా ప్రాంగణం మార్మోగింది. బీసీ సీఎం నినాదంతో మంగళవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన 'బీసీ ఆత్మగౌరవ సభ'కు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో కలిసి ప్రధాని ఓపెన్ టాప్ జీపుపై నిలబడి.. జనం మధ్య ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. నిత్యం బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో, జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత మధ్య కనిపించే ప్రధాని అనూహ్యంగా కార్యకర్తల మధ్యకు రావడంతో అభిమాను లు ఉబ్బితబ్బిబ్బయ్యారు. బారికేడ్లకు అవతలి వైపున ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు.

ఫోన్ లైట్లు వెలిగించి.. మద్దతు పలికి

'సమ్మక్క సారలమ్మలకు.. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామికీ' అంటూ తెలుగులో మోదీ ప్రసంగాన్ని ఆరంభించారు. 'కుటుంబ సభ్యుల్లారా.. బీసీ ఆత్మ బంధువుల్లారా.. ఈ సభలో నేను భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎల్బీస్టేడియంతో నాకు ఎంతో అనుబంధం ఉంది. నాటి సభలో నా ప్రసంగం కోసం టికెట్ పెట్టారు. దేశ చరిత్రలో అది కొత్త ప్రయోగం. ఇదే గ్రౌండ్‌లో ప్రజలు ఆశీర్వదించడంతో నేను ప్రధాని అయ్యాను. ఇదే మైదానం సాక్షిగా బీజేపీ బీసీ ముఖ్యమంత్రి రాబోతున్నారు. పేదలకు ఐదు కేజీల బియ్యం పంపిణీ పథకం చేపట్టి ఐదేళ్లు అవుతోంది. ఈ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సభకు హాజరైన పేద, మధ్య తరగతి ప్రజలంతా మద్దతు తెలుపాలని కోరుతున్నా'నని చెప్పగానే కార్యకర్తలు, అభిమానులు తమ జేబుల్లోని స్మార్ట్‌ఫోన్లను బయటికి తీసి.. టార్చ్ లైట్లు వెలిగించి మోదీకి మద్దతు ప్రకటించారు.

సీఎం.. సీఎం అనే నినాదాలతో హోరెత్తి..

పార్టీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, ఈటల రాజేందర్ ప్రసంగిస్తున్న సమయంలో అభిమానులు సీఎం.. సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణ యాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు వేదికపై ఆసీనులై.. ప్రధాని మోదీతో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. మోదీ రాక సందర్భంగా పోలీసులు ఎల్బీస్టేడియం చుట్టూ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నిజాం కాలేజీ, బషీర్‌బాగ్, నాంపల్లి, అసెంబ్లీ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అది రెడ్డి భవన్

కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీరని అన్యాయం చేసింది. రాజస్థాన్ డిక్లరేషన్‌లో 34 సీట్లు ఇస్తామని.. 24 సీట్లే ఇచ్చింది. అది కూడా ఓడిపోయే పాత బస్తీలో బీసీలకు టికెట్లు ఇచ్చింది. అది గాంధీ భవన్ కాదు.. రెడ్డి భవన్. రెడ్లకే అక్కడ ప్రాధాన్యత ఉంది. బీసీలకు కనీస గౌరవం లేదు. ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకే బీజేపీ మెజార్టీ టికెట్లు కేటాయించింది. వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మహిళా బిల్లులో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి.

– జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

నామినేషన్ పర్వం



ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేస్తున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్

- షాద్‌నగర్‌రూరల్



మహేశ్వరం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

- మహేశ్వరం

రామ్మా చిలకమ్మ.. జాతకం చెప్పమ్మ



ప్రచారంలో భాగంగా చిలుక జోస్యం చెప్పించుకుంటున్న చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య

- మొయినాబాద్‌రూరల్

అలక వీడిన పారిజాత



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత నర్సింహారెడ్డి దంపతులు అలక వీడారు. మంగళవారం పార్టీ మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

- బడంగ్‌పేట్

జైకొట్టి.. హారతి పట్టి



హస్తినాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి గిరిజన మహిళలు ఇలా హారతి పట్టారు.

- హస్తినాపురం

ఎన్నికల నేరానికి శిక్ష..!

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు



షాద్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఎన్నికల వేళ నాయకులు ఓటర్లు ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఏవిధంగానైనా విజయం సాధించేలానే పట్టుదలతో ఆవేశంలో తప్పులు చేస్తుంటారు. ఓట్లు రాబట్టేందుకు బెదిరింపులకు పాల్పడుంటారు. అయితే ఎన్నికల సంఘం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యానికి రక్షణ కల్పిస్తుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారు శిక్షార్హులు అవుతారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షలు

- నామినేషన్ దాఖలు చేసేటప్పుడు తప్పుడు సమాచారం ఇస్తే ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానా.
- ఎన్నికల అధికారులు, సిబ్బంది ఓటర్లను ప్రభావితం చేస్తే ఆరు నెలల పాటు జైలు శిక్ష.
- సభలు సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి. ఎన్నికల సమయానికి 48 గంటల ముందే బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించవద్దు. ఓటర్లను ఆకట్టుకునే విధంగా వినోదాత్మక కార్యక్రమాలు చేపడితే రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.
- కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా.
- ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత గొడవలకు పాల్పడితే ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటుగా రూ.2వేల జరిమానా.
- మద్యం, డబ్బు పంపిణీ చేస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటుగా రూ.200 జరిమానా.
- ఎన్నికల కరపత్రాలు, వాల్‌పోస్టర్లపై ముద్రించిన వారి పేరు చిరునామా విధిగా ఉండాలి. ఒక కాపీని తప్పనిసరిగా ఎన్నికల అధికారులకు ఇవ్వాలి. లేదంటే ఆరు నెలల శిక్ష లేదా రూ.2వేల జరిమానా.
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహిస్తే రూ.250 జరిమానా.
- లౌడ్‌స్పీకర్లు పెట్టి అరవడం, ఇతరులపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే మూడు నెలల జైలు శిక్ష.
- ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా పని చేయవద్దు. ఇలా చేయడం చట్ట రీత్యా నేరం. వారికి మూడు నెలల శిక్ష.
- ప్రచార వాహనాలకు అనుమతి లేకుంటే మూడు నెలల జైలు శిక్ష.
- ఈవీఎంలు ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తే ఏడాది పాటు జైలు.
- పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే ఏడాదికి తగ్గకుండా.. మూడేళ్లకు మించకుండా జైలు శిక్షతో పాటుగా జరిమానా విధిస్తారు.
- ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే శిక్షార్హులు.
- రిగ్గింగ్, దొంగ ఓట్లేసేందుకు యత్నిస్తే శిక్షార్హులు
- నగదు, మద్యం, బంగారు, వెండి ఆభరణాలు రవాణా చేసినా.. ఓటర్లకు పంచినా కేసులు, శిక్షలుంటాయి.

కఠిన చర్యలు



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

– ప్రతాప్ లింగం, సీఐ, షాద్‌నగర్ టౌన్

అనుమతులు తప్పని సరి



ఎన్నికల ప్రచారం కోసం ఆయా పార్టీల నేతలు నిర్వహించే సభలు సమావేశాలు, ర్యాలీలకు విధిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా వాహనాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవు.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్

ఇద్దరే అమాత్యులు!

మూడు దశాబ్దాలుగా మళ్లీ దక్కని మంత్రి పదవి



చిత్తరంజన్‌దాస్, మాజీ మంత్రి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి విజయం సాధించిన ఎమ్మెల్యేలలో ఇప్పటివరకు ఇద్దరికి మాత్రమే మంత్రి పదవులు వరించాయి. 1962 ఎన్నికలలో లట్టుపల్లి వెంకట్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో ఆయన చోటు దక్కించుకున్నారు. 1989 ఎన్నికల్లో టీడీపీ అధినేత ఎన్టీఆర్‌ను ఓడించిన కాంగ్రెస్ అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ సంచలనం సృష్టించారు. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి కల్పన, టూరిజం, బీసీ సంక్షేమ శాఖామంత్రిగా పనిచేశారు.

కాంగ్రెస్ అభ్యర్థికి బీఫాం



నరేందర్ ముదిరాజ్‌కు బీఫాం అందజేస్తున్న రోహిత్ చౌదరి

మణికొండ: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కస్తూరి నరేందర్‌ముదిరాజ్ మంగళవారం గాంధీభవన్‌లో బీఫాం తీసుకున్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జ్ రోహిత్ చౌదరి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. ఈనెల 9న నామినేషన్ వేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని, నామినేషన్ దాఖలు అయిపోగానే పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తామన్నారు.

ఆ ముగ్గురి ప్రస్థానం అక్కడి నుంచే

- స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్యేలుగా ఎదిగిన నాయకులు
- సర్పంచ్ నుంచి ఇంద్రారెడ్డి
- జెడ్పీచైర్మన్‌గా పనిచేసిన కేఎస్.రత్నం
- సింగిల్ విండో చైర్మన్ నుంచి ఎదిగిన కాలె యాదయ్య



చేవెళ్ల: నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి 16 ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు గెలిచి నిలిచారు. వీరిలో దివంగత ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక సంస్థల నుంచి ప్రజాప్రతినిధులుగా తమ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ఇంద్రారెడ్డి మంత్రి పదవిని సైతం చేపట్టారు.

సర్పంచ్ పదవిలో ఉండగానే..

మండల పరిధిలోని కౌంకుంట్ల గ్రామానికి చెందిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి 1981లో ఆ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా పనిచేస్తుండగానే 9185 లో వచ్చిన శాసన సభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. గతంలో ఆయన జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. దీంతో ఆయన 1985లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.నాటి నుంచి ఆయన వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రెండు పర్యాయాలు మంత్రిగా సేవలందించారు.

పార్లమెంట్ వద్దంది.. అసెంబ్లీ ఆహ్వానించింది

నియోజకవర్గ పరిధిలో మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేఎస్. రత్నం శంషాబాద్ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి 1995లో రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం ఆయన సైకిల్ పై హైదరాబాద్ ఎంపీగా, 2004 లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తదనంతరం చేవెళ్ల అసెంబ్లీ స్థానం ఎస్సీలకు రిజర్వు చేయడంతో 2009లో ఆయన టీడీపీ నుంచి పోటీ చేసి చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్, 2018లో కాంగెస్ నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరి ఎమ్మెల్యే బరిలో నిలిచారు.

అంచలంచెలుగా ఎదిగిన నేత

నియోజకవర్గంలోని నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామానికి చెందిన కాలె యాదయ్య స్థానిక సంస్థల రాజకీయల నుంచే వచ్చారు. ఆది నుంచి హస్తాన్ని అంటి పెట్టుకున్న ఆయన 1992–95వరకు నవాబుపేట మండల సింగిల్ విండో చైర్మన్‌గా, డీసీఎంస్ డైరెక్టర్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. 1995–2000 వరకు నవాబుపేట జెడ్పీటీసీ సభ్యుడిగా, 2001–06 వరకు నవాబ్ ఎంపీపీగా పనిచేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా ఎదిగిన ఆయన 2009లో కేఎస్ రత్నం చేతిలో ఓటమి చవిచూశారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆయన గులాబీ గూటిలో చేరారు. 2018లో కారు గుర్తుపై అసెంబ్లీకి వెళ్లారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ నుంచి చేవెళ్ల బరిలో నిలిచారు. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా వ్యూహ రచనలు చేస్తున్నారు.

తాత్కాలిక కార్యాలయాలకూ..

- నిబంధనలు తప్పనిసరి
- ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు జారీ

మీకు తెలుసా?

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేస్తుంటారు. కార్యకర్తలు ఉదయం, సాయంత్రం కలుసుకుని ప్రచార సరళిపై చర్చించుకోవడం.. అభ్యర్థులు వచ్చిన సమయంలో మాట్లాడుకోవడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడుతుంటాయి. అయితే వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

- పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఏర్పాటు చేయొద్దు
- వీటిపై పార్టీ జెండా, బ్యానర్, చిహ్నాలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఉదయం 6గంటల లోపు, రాత్రి 10గంటల సమయం దాటితే మైక్‌లు, లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దు.
- ప్రచార తేదీ ముగిసిన తర్వాత ఓటర్లు కానివారు నియోజకవర్గంలో ఉండొద్దు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లకు ఈ నిబంధన వర్తించదు.
- రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయొద్దు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదైన ఫొటోతో కూడిన ఓటరు గుర్తింపు కార్డున్న వ్యక్తి మాత్రమే పోలింగ్ ఏజెంట్‌గా అర్హుడు.
- ఎస్ఎంఎస్ ద్వారా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దు.

ఓటు జీవితావసరం



సెలబ్రిటీ కామెంట్

ప్రజాస్వామ్యంలో ఓటు అనేది హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి జీవితావసరం అని గుర్తుంచుకోవాలి. ప్రతి మనిషికి ఆహారం, వస్త్రాలు, ఇల్లు మాదిరిగానే ప్రతి వయోజనుడికీ ఓటు కూడా తన కనీస అవసరంగా భావించాలి. ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. యువత అత్యధికంగా ఉన్న దేశం కూడా. యువత ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొనాలి. నేటి యువతరం అన్ని రంగాల్లోనే చురుకుగా, మెలకువతో వ్యవహరిస్తోంది. ఓటింగ్ దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఆసక్తి చూపట్లేదు. రేపు నాయకులు కాదల్చితే నేడు కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. నగరంలో ఉన్న సీనియర్ సిటిజన్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి, తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి యువత సహకరించాలి. మా పెద్ద కుమార్తె ప్రకృతికి ఈసారే ఓటు హక్కు వచ్చింది. మా కుటుంబంలోకి వచ్చిన ఈ కొత్త ఓటర్ మాలాగే కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోనుంది.

– బి.సుమతి, ఐపీఎస్

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

29 Lacks Only in Prime Location East & West Facing Proposed Flats for sale, Car Parking. Get Monthly Rent 20,000/- Ph: 9502937289 [H-189447]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788202]

బ్యాంక్,ప్రైవేట్ సంస్థలలోతాకట్టుపెట్టిన బంగారంను మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలలో తక్కువ(88పైసలు)వడ్డీకి,ఎక్కువగ్రాము (4500) రేటుకు తాకట్టు పెట్టించబడును.8977044454 [T-764170]

BUSINESS OFFER

Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9502307742 [H-193270]

HOME NEEDS

PEST CONTROL

చెదలు, బొద్దింకల నివారణ, న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10సం॥ల గ్యారెంటీ & ఎలుకలు, నల్లులు, Lizard విముక్తికై సంప్ర: 9392468282, 8333030227. [HA-12530]

OLD AGE HOME

వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd సంప్ర: 9949520296, 7981467036. [H-793483]

PERSONAL CARE

CHANGE OF NAME

I, Syed Rafiq Ahmed my father Original Name as Sayed Ahmed R/o. 8-3-616/A, Yellareddy Guda, Ameerpet, Hyd-73, Henceforth Changed my father name as Late. SYED AHMED only. [HA-4280]

I, Madhavi Annapurna Devi Chilukuru, W/o. Bala Subrahmanyam Srikakulapu, R/o. Villa No.205, Praneeth Pranav Panorama, Narendra Nagar Colony, Ameenpur, Hyd-502032, have changed my name to Madhavi Annapurna Devi Chilikuri, for all purposes. [HA-31197]

I, ARCHANA ADEPU (Old Name) W/o. Adepu Venkata Rajendra Kumar, Age about 37 yrs, R/o. Flat 3306, Vasavi Brindavanam, Erragadda, Hyderabad - 500018, T.S. India have changed my name to ARCHANA VEERAGONI (New Name) [W-189197]

I, S Akash Alias Pathrolia Akash S/o. Pathrolia Vijay R/o. #1-9-286/2/4/C/1, Flat No.114, Block-C, Janapriya Castle, Ramnagar Gundu, Vidyanagar, Hyderabad-500020 have changed my name and shall hereafter be known as PATHROLIA AKASH. [HA-9333]

LOST

I, Madugu Nagarjuna S/o. Madugu Naganna R/o. F.No. 92,Block-D, Indra Nagar, Opp: Pullela Gopichand Academy, Gachibowli, Ranga Reddy, T.S. I have lost my Expiry Passport Bearing No. K8584745 Expiry Dated 26/11/2022, while House shifting at Gachibowli on 25/10/2023, anybody found call: 9742161691 [H-793519]

Wanted

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189349]

అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427694 [H-788844]

వంట, ఇంటి పనికి, పిల్లలను, వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి, కేర్‌టేకర్స్, ఆయాలను మీ ఇంటి వద్దకు పంపబడును 20-40 సం. స్త్రీ/పు వర్కర్స్ కావలెను. ఫోన్ : 6309807798, 9121099519 [H-788205]

ITI, డిప్లొమా ఎలక్ట్రికల్, మీటర్ రీడింగ్, ఎలక్ట్రీషియన్ వెల్డర్స్, రిసెప్షనిస్ట్, టెలికాలర్లు DTP డాటాఎంట్రీ (ఇంటిలో ఉండే) హెల్పర్స్, డ్రైవర్లు, కలెక్షన్ బాయ్స్, సూ॥వైజర్, మేనేజర్లు 10th-PG జీ: 15-20K, ఫ్రీ రూం.మీల్స్ @9505261777 [H-788345]

లేడీ హెల్పర్స్/వాచ్‌మెన్ (రూం వసతి కలదు) ఫ్లెక్సీ బోర్డు కంపెనీకి కావలెను. ఆలీ కేఫ్ చౌరస్తా, అంబర్‌పేట్. Ph: 9963999123, 040-29887188. [H-793382]

హైదరాబాద్‌లో ప్రముఖ కాలేజీలో పని చేయుటకు "సెక్యూరిటీ గార్డులు" కావలెను. రూం + భోజనం ఫ్రీ. జీతం: 11 వేలు – 13 వేలు. ఫోన్: 9000381616, 6304582355 [HA-12523]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221905]

తెలంగాణలో పొలిటికల్ నాలెడ్జ్ ఉన్న విలేజెస్ కో-ఆర్డినేటర్స్ కావలెను MIN: ఇంటర్, Age: 21-45, రోజుకు 1000/- & లేడీ టెలికాలర్స్ కావలెను. Ph: 9985433124 [H-793521]

రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-193284]

Wanted Lady Tele Caller, Work From Home, Fresher/Experience, Good Salary, Hyd, Contact: 8019106121 [H-788347]

Urgently Required Collection Executive in Hyderabad Location for Reputed NBFC Company. Contact. 9581825815, 9618025712 [HA-12524]

Wanted Stockists/ Distributors for Hastenol Lubricants (Engine Oil Company) for all areas @Hyderabad. Ph: 7997601111 [H-189445]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

బీజేవైఎం కార్యవర్గ సభ్యుడి రాజీనామా

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీ మాజీవార్డు సభ్యుడు, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడైన క్లెం శ్రావణ్‌గౌడ్ మంగళవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ నినాదం చేస్తున్న బీజేపీలో బీసీలకు ఏమాత్రం గౌరవం లేదని ఆరోపించారు.

బూత్‌స్థాయి నాయకులే కీలకం

తమిళనాడు ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణుప్రసాద్

పరిగి: పార్టీ అభ్యర్థి గెలుపులో బూత్‌స్థాయి నాయకులే కీలకమని తమిళనాడు ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణుప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రీన్ పార్క్ హాల్‌లో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, బూత్‌స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు బూత్‌స్థాయి నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకుందామని, ఈ సారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి బహుమతిగా ఇద్దామన్నారు. బూత్‌స్థాయి నాయకులు కష్టపడి పార్టీకి మెజారిటీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ అభ్యర్థి టీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 రోజులు కష్టపడి పనిచేస్తే ఐదు సంవత్సరాలు పేదలకు సేవ చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏఏ పనులు చేస్తుందో ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

రూ.59 కోట్లు.. 9 కేసులు

- రూ.1.69కోట్ల వారసత్వ ఆస్తి
- రూ.22.40 కోట్ల అప్పులు
- ఎలక్షన్ అఫిడవిట్‌లో పేర్కొన్న కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: సుమారు రూ.59కోట్లకు పైగా విలువచేసే ఆస్తులున్నాయని, వివిధ పోలీస్‌స్టేషన్లలో తొమ్మిది కేసులున్నట్లు ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. చేతిలో రూ.5లక్షల నగదు, ఆరు బ్యాంకు ఖాతాల్లో రూ.3,76,50,595, 2015 మోడల్ ఆడి కారు (ప్రస్తుతం రూ.15లక్షల విలువ), 2014 మోడల్ మహేంద్ర బొలేరో (ప్రస్తుత విలువ రూ.లక్ష) 8తులాల బంగారం, 10కిలోల వెండి ఉన్నట్లు వెల్లడించారు.

స్థిరాస్తులు

తొర్రూర్‌లో రూ.1.60కోట్ల విలువైన 35 గుంటల భూమి, బొంగుళూర్‌లో రూ.3కోట్ల విలువ చేసే 2.32 ఎకరాల భూమి, కోహెడాలో రూ.19.30కోట్ల విలువ చేసే 20.20 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు.

నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్

మన్సూరాబాద్‌లో రూ.90 లక్షల విలువ చేసే 418 చదరపు గజాల స్థలం, కుంట్లూర్‌లో రూ.1.60కోట్ల విలువ చేసే రెండు ప్లాట్లు, హయత్‌నగర్ మండలం బహదూర్‌గూడలో రూ.3,86,93,610 విలువచేసే 1029 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న భవనం, రాయదుర్గంలో కుమారుడు అభిషేక్‌రెడ్డితో కలిపి 1000 చదరపు అడుగులు స్థలం, (మల్‌రెడ్డి భాగం ప్రస్తుత విలువ రూ.65లక్షలు), రాయదుర్గంలో రూ.3.50లక్షల విలువ చేసే 161 చదరపు గజాల్లో భవనం, గచ్చిబౌలిలోని రూ.7.50కోట్ల విలువైన మీనాక్షి టెక్ పార్కులో 207 చదరపు గజాల్లో భవనం, సరూర్‌నగర్ మండలం ద్వారకపురంలో అపార్టుమెంట్‌లోని ప్లాట్ల షేర్ల విలువ రూ.7.50 కోట్లు, సంఘీ లెదర్స్ లిమిటెడ్‌లో షేర్స్ రూపంలో రూ.2.50 లక్షలు, మహాలక్ష్మీ థియేటర్‌లో 20శాతం షేర్ ఉన్నట్లు అఫడవిట్ పేర్కొన్నారు.

నివాస గృహాలు

చైతన్యపురి ప్రభాస్‌నగర్‌లో రూ.1.44 కోట్ల విలువైన 500 చదరపు గజాల్లో ఇల్లు, మాదాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ అపార్టుమెంట్‌లో రూ.కోటి విలువచేసే 1500 చదరపు అడుగుల ఫ్లాట్లున్నాయి. మొత్తం మల్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.59,75,93,610 కాగా అందులో రూ.1.60కోట్లు వారసత్వ ఆస్తిగా పేర్కొన్నారు.

అప్పులు

ఎస్‌బీఐ సైఫాబాద్ బ్రాంచ్‌లో తనయుడు అభిషేక్ రెడ్డితో కలిపి తీసుకున్న రూ.6కోట్ల అప్పుల్లో మల్‌రెడ్డి భాగానికి రూ.3కోట్లు, అదే బ్యాంకులో మల్‌రెడ్డి మరో రూ.19,40,376 అప్పు చెల్లించాల్సివుందన్నారు.

సతీమణి అనసూయ పేరిట

అనసూయ చేతిలో రూ.3లక్షల నగదు, నాలుగు బ్యాంకు అకౌంట్లల్లో రూ.15,51,088 ఉన్నాయి. కిలో బంగారం, 5 కిలోల వెండి, రూ.28,867 సాలీనా చెల్లించే ఇన్సూరెన్స్ పాలసీ ఉన్నట్లు చూపారు.

వ్యవసాయ భూములు

కోహెడాలో రూ.9కోట్ల విలువ చేసే 11.2ఎకరాలు, బొంగుళూర్‌లో రూ.2.40 కోట్ల విలువైన 2.4 ఎకరాల భూమి ఉంది.

నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్

మక్తా మహబూబ్‌పేట్, శేరిలింగంపల్లిలో రూ.65 లక్షల విలువైన 998 చదరపు గజాల ఫ్లాటు, కమర్షియల్ భవనాలు హయత్‌నగర్ మండలం బహదూర్‌గూడలో 3,86,93,610 విలువచేసే 1029 చదరపు గజాల్లో నిర్మాణంలో ఉన్న భవనం, సరూర్‌నగర్ మండలం ద్వారకపురంలో అపార్టుమెంట్ రూ.3 కోట్ల విలువచేసే 4.5శాతం షేర్లు ఉన్నాయి.

తిరుమల హిల్స్‌లో రూ.5కోట్ల విలువైన ఇల్లు

తొర్రూర్‌లో రూ.36 లక్షల విలువైన వెయ్యి గజాల స్థలంలో ఇల్లు, తిరుమల హిల్స్ రూ.5 కోట్ల విలువ చేసే 1012 గజాల్లో ఇల్లు, రూ.12లక్షల విలువచేసే 2017 మోడల్ ఇన్నోవాతో కలిపి మల్‌రెడ్డి రంగారెడ్డి భార్య అనసూయ ఆస్తుల విలువ రూ.18,97,93,610 ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఎస్‌బీఐ సైఫాబాద్ బ్రాంచ్‌లో రూ.4,46,897 అప్పులున్నట్లు తెలిపారు.

యువతకు సదుపాయంగా..

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా ఓటుహక్కు పొందిన యువతకు సదుపాయంగా ఉండేలా నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. వీటిని యువ అధికారులే నిర్వహిస్తారు. వివిధ విభాగాల్లోనూ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటి లో భాగంగా శారీరక వికలాంగులే(దివ్యాంగులు) నిర్వహించేలా నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని, మహిళలకు తగిన గుర్తింపునిస్తూ నిర్వహణ మొత్తం మహిళలే నిర్వహించేలా ఉద్యోగినులతో నియోజకవర్గానికి ఐదు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు మిగతా అన్ని పోలింగ్ కేంద్రాల కంటే ప్రత్యేకంగా ఉండేలా నియోజకవర్గానికి ఐదు పోలింగ్ కేంద్రాలను సకల సదుపాయాలతో తీర్చిదిద్దనున్నారు. మహిళలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందితో పాటు సాధ్యమైనంత మేరకు పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది సైతం మహిళలే ఉండేలా చూస్తారు. సదరు కేంద్రాల్లో రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు సైతం మహిళలు ఉండేలా రాజకీయ పార్టీలను కోరనున్నారు. నియోజకవర్గానికో పోలింగ్ కేంద్రాన్ని దివ్యాంగులైన ఉద్యోగులు నిర్వహించేలా ఏర్పాటు చేయనున్నారు. తాము కూడా మిగతా వారికే మాత్రం తీసిపోమని తగిన మానసిక స్థైర్యం కల్పించేందుకు ఇవి ఉపకరిస్తాయని భావిస్తున్నారు. ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే భవనాలను అధికారులు ఇప్పటికే గుర్తించారు.

వాట్సాప్ గ్రూపుల సభ్యత్వానికి తహతహ

- బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం గ్రూపుల్లో ప్రచారం
- వ్యతిరేకిస్తున్న సభ్యులు
- రాజకీయ పోస్టులతో సతమతమవుతున్న గ్రూప్ అడ్మిన్లు



రాజేంద్రనగర్: నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థులు బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాల సంక్షేమ సంఘం వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం కోసం పోటీ పడుతున్నారు. సెగ్మెంట్ పరిధిలో బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్, విల్లాలకు సంబంధించిన సంక్షేమ సంఘాలు కొనసాగుతున్నాయి. సంక్షేమ సంఘాల అభివృద్ధి, స్థానికంగా మౌలిక వసతుల కల్పన కోసం ఈ సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘాల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు కొనసాగుతున్నారు. ప్రతి సంక్షేమ సంఘం తమ కార్యవర్గ సభ్యులతో పాటు తమ కాలనీ, బస్తీలకు చెందిన వారందరి ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంది. ఈ వాట్సాప్ గ్రూపుల్లో కేవలం తమ సంక్షేమ సంఘం అభివృద్ధి, చేపడుతున్న కార్యక్రమాలు ఇతర ముఖ్య సమాచారం ఏమైన ఉంటే పోస్టు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రూపుల్లో తమకు స్థానం కల్పించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు వేడుకుంటున్నారు. తమ ప్రచారాన్ని ఈ గ్రూపుల ద్వారా నిర్వహించుకుంటామంటూ విన్నవిస్తున్నారు. దీంతో ప్రచారం కాస్తా వాట్సాప్ గ్రూపుల్లో ప్రారంభమైంది.

అడ్మిన్‌లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు

వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లషన్ల వివరాలను తెలుసుకుంటున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వారితో సమావేశాలు నిర్వహించి ముఖ్య నాయకుని నంబర్‌ను అందులో యాడ్ చేయిస్తున్నారు. రోజూ ఈ గ్రూపుల్లో తమ పార్టీకి సంబంధించిన ఫోటోలు, క్లిప్పింగ్‌లు, పేపర్‌లో వచ్చిన వార్తలను పోస్టు చేస్తున్నారు.

వ్యతిరేకిస్తున్న కొందరు...

ప్రస్తుతం కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాల వాట్సాఫ్ గ్రూపుల్లో పార్టీల ప్రచారాన్ని స్థానిక సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో విబేధిస్తున్నారు. ఇంటింటికీ ప్రచారం చేసుకోవచ్చని.. ఇలా గ్రూపుల్లో పోస్టులు చేయడం సరి కాదంటూ పోస్టులు పెడుతున్నారు. కొందరు ఈ గ్రూపుల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పార్టీల ప్రచార పోస్టులతో విసుగు చెంది లెఫ్ట్ అవుతున్నారు.

వాట్సాప్ ప్రచారమే ప్రధానం

వాట్సాప్ గ్రూపుల్లో వందలాది మంది ఉంటుండటంతో ఇందులో ప్రచారం కోసం అన్ని పార్టీల నాయకులు మొగ్గు చూపుతున్నారు. ఒకే ఒక పోస్టుతో వందల మందికి చేరుకోవచ్చనే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

- రోజూ ప్రత్యేకంగా అభ్యర్థులే గ్రూపుల వివరాలను తెలుసుకుంటూ.. ముఖ్య నాయకులను అన్ని గ్రూపుల్లో సభ్యత్వం పొందాలంటూ ఆదేశిస్తున్నారు.
- ప్రచారం రోజు రోజుకు వేడెక్కుతుండటంతో వాట్సాప్‌లలో ఈ ప్రచారం ఇంకాస్తా రగులుతోంది.

ఎవరికీ చెప్పలేకపోతున్నాం...

తమ బస్తీ, అపార్ట్‌మెంట్, విల్లాల అభివృద్ధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుల్లో పార్టీల వారి నంబర్లను యాడ్ చేయడం ఇబ్బందిగా మారిందని సంక్షేమ సంఘం సభ్యులు వాపోతున్నారు. ఏ ఒక్కరినీ కాదన్న రేపు దాని పరిణామం ఏలా ఉంటుందో చెప్పలేక సతమతమవుతున్నామంటూ వెల్లడిస్తున్నారు. ఒకరిని యాడ్ చేయగానే ఇతర పార్టీల వారు తమను యాడ్ చేయాలని చెబుతున్నారని, దీంతో సభ్యులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. రోజూ ఒకపోస్టు చేయాలని తెలిపినా, తమ కాలనీకి వచ్చినప్పుడు పోస్టు చేయాలన్నా పట్టించుకోవడం లేదని వెల్లడిస్తున్నారు.